క్లుప్తంగా

కలెక్టరేట్ వద్ద చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ కాశీవిశ్వేశ్వరరావు తదితరులు

అమలాపురం రూరల్: లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ఫౌండేషన్, కోనసీమ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వేసవి కాలంలో వంద రోజులు మంచినీరు అందించేందుకు కలెక్టరేట్ ఎదురుగా అంబేద్కర్ కమ్యూనిటీ హాలు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కలెక్టరేట్ ఏఓ కె.కాశీవిశ్వేశ్వరరావు, డాక్టర్ కారెం రవితేజ దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు హనుమాన్ బుజ్జి, చీకట్ల కిరణ్‌కుమార్, ఆకుల ఆర్కే.నాయుడు, కంచిపల్లి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుండలేశ్వరానికి ఆర్టీసీ బస్సు నడపాలి

అమలాపురం టౌన్: దక్షిణ కాశీగా పేరు గాంచిన కాట్రేనికోన మండలం కుండలేశ్వరం పుణ్య క్షేత్రానికి ఆర్టీసీ బస్సు నడపాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం అమలాపురం, ఇతర డిపోల నుంచి కుండలేశ్వరానికి రోజుకు మూడు ట్రిప్పుల సర్వీస్‌లను ప్రవేశపెట్టాలని సూచించారు. వచ్చే పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని కుండలేశ్వరంలో స్నాన ఘాట్ల వద్ద వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు పితాని బేబీరావు, కొనుకు వెంకటేశ్వరరావు, యండమూరి శ్రీనివాస్, తల్లోజు మల్లేశ్వరరావు, కొపనాతి తాతాజీ, పోతాబత్తుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్ గురువారం పరిశీలించారు. 203 మంది కూలీలు మూడు వారాలుగా పంట బోదెల పూడికతీత, కొబ్బరి చెట్లకు పళ్లాలు కొట్టడం వంటి పనులు చేస్తున్నారు. సర్పంచ్ ఆయా పనులను పరిశీలించి, మస్టర్లను తనిఖీ చేశారు. గ్రామంలో చేపడుతున్న పనులు రైతులకు ఉపయోగకరంగా ఉండాలని ఫీల్డ్ అసిస్టెంట్ అయితాబత్తుల శ్రీనివాసరావుకు ఆయన సూచించారు. ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ కె.బాలరాజు ఉన్నారు.

స్థానికులకు ఉద్యోగాల కోసం ధర్నా

అల్లవరం: ఓడలరేవులో చమురు కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓఎన్జీసీతో పాటు, అందులోని ప్రైవేటు కంపెనీలు స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేస్తున్నాయని ఓడలరేవు గ్రామస్తులు ఆరోపించారు. స్థానికులు ఉద్యోగాలకు కల్పించకుండా దగా చేసిన ఓ కంపెనీకి వ్యతిరేకంగా గురువారం నిరసన తెలిపారు. ఆ కంపెనీ స్థానికులకు 30 ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం 18 మందినే నియమించారని తెలిపారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

అమలాపురం రూరల్: ఆర్టీసీ అమలాపురం డిపోలో హెవీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా పదో బ్యాచ్ శిక్షణను సంస్థ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, డ్రైవర్ల ఆవశ్యకత మేరకు ఆర్టీసీ శిక్షణ అందిస్తుందన్నారు. ఎంవీఐ కె.రవికుమార్ మాట్లాడుతూ, అభ్యర్థులు డ్రైవింగ్ మెళకువలు నేర్చుకుని, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు, మెయింటెనెన్స్‌పై అవగాహన కలిగిస్తున్నామన్నారు. త్వరలో 11వ బ్యాచ్ ప్రారంభిస్తామని తెలిపారు. అభ్యర్థులు డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ రజాక్ (సెల్ 73829 09588)ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ప్రతిమాకుమారి, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ జీఎల్‌వీ దేవి పాల్గొన్నారు.

చర్చిల అనుమతులపై విచారణ తగదు

ముమ్మిడివరం: క్రైస్తవ ఆలయాల అనుమతులపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ తగదని మాల మహానాడు ముమ్మిడివరం జేఏసీ నాయకుడు దేవరపల్లి ఏడుకొండలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జీఓ ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని గురువారం ఇక్కడ డిమాండ్ చేశారు. ఈ జీఓ క్రైస్తవుల మనోభావాలను దెబ్బ తీయటమేనన్నారు. ఇది ఆర్టికల్ 25కి విరుద్ధంగా ఉందని, రాజ్యాంగాన్ని అవమానపరిచనట్లు అవుతుందన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలపై సర్వేలు నిలుపుదల చేయాలని సుప్రీం కోర్టు ఇటీవల స్టే ఇచ్చిందని గుర్తు చేశారు.

తీరని వారధి వ్యథ

- శిథిలమైన ఇంజరం వంతెన
- పునర్నిర్మాణంపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యం
- తాత్కాలిక తూరలతో సాగునీటి సమస్యలు
- చెత్తాచెదారంతో శివారు ప్రాంతాలకు చేరని నీరు
- తక్షణం వంతెన నిర్మించాలని రైతుల డిమాండ్



శిథిల స్థితికి చేరిన ఇంజరం వంతెన

తాళ్లరేవు: వంతెన శిథిలమై ఏళ్లు గడుస్తున్నా నిర్మాణానికి మాత్రం నోచుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు అదిగో నిర్మిస్తాం, ఇదిగో నిర్మిస్తామంటూ మాటలు చెప్పడమే మినహా, కార్యరూపం దాల్చడం లేదు. దీంతో అటు ప్రయాణికులు ఇటు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యానాం–ద్రాక్షారామ రహదారిలో ఇంజరం వద్ద పంట కాలువపై ఉన్న వంతెన శిథిలమై, నిరుపయోగంగా మారింది. ఈ వంతెన నిర్మాణం కోసం స్థానిక ప్రజలతో పాటు, శివారు ప్రాంతాల రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వంతెన శిథిల స్థితికి చేరుకోవడంతో ఆరేళ్ల క్రితం వంతెన పక్కనే తాత్కాలికంగా తూరలతో కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మించారు. వంతెన పునర్నిర్మాణం ఇప్పటికీ జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బ్రిటిష్ కాలంలో..

పిల్లంక సాగునీటి ప్రధాన కాలువపై బ్రిటిష్ వారి కాలంలో ఈ వంతెన నిర్మించారు. కొన్నేళ్ల క్రితం ఈ వంతెన కుంగిపోయి, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో తాత్కాలికంగా వాహనాల రాకపోకలతో పాటు, సాగునీరు వెళ్లే విధంగా భారీ తూరలను వేసి, కల్వర్టు నిర్మించి, రోడ్డు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. సాగునీటి సరఫరా కోసం వేసిన తూరల వద్ద చెత్త చెదారం పేరుకుపోవడం, భారీ స్థాయిలో చెత్త చేరడంతో నీరు పారని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా మండలంలోని శివారు ప్రాంతాలకు సాగు నీరందక ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

సాగు నీరందక..

ప్రధానంగా తాళ్లరేవు, పి.మల్లవరం, పోలేకుర్రు, జార్జిపేట, నీలపల్లి, గాడిమొగ ప్రాంతాల్లోని శివారు భూములకు నీరు అందక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ కాలువ పరిధిలో సుమారు ఆరు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తుండగా, సుమారు రెండు వేల ఎకరాలకు పైగా నీటి ఎద్దడి నెలకొందని రైతులు వాపోతున్నారు. తూరల వద్ద రెండు, మూడు రోజులకు ఓసారి చెత్తను తొలగిస్తున్నప్పటికీ, సాగునీరు శివారు ప్రాంతాలకు చేరని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పంట చేతికొచ్చే సమయంలో నీటి ఎద్దడి కారణంగా వరిచేలు ఎండిపోతున్నాయని, కనీసం ఇంజిన్లు పెట్టినా నీరందని పరిస్థితులు నెలకొంటున్నాయని శివారు ప్రాంత రైతులు వాపోతున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, ఇతర ఖర్చులు పెరిగిపోయి ఇబ్బందులు పడుతుంటే, సాగునీటిని తోడుకునేందుకు ఎకరాకు మరో రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు అదనపు భారం పడుతుందని అంటున్నారు. తమ సమస్యలన్నింటికీ ప్రధాన కారణమైన ఇంజరం వంతెనను తక్షణమే నిర్మించి, పూర్తి స్థాయిలో సాగునీరు అందేవిధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వంతెన నిర్మాణాన్ని ఆరు నెలల్లోపు పూర్తిచేస్తామని చెప్పినప్పటికీ, అది ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే వంతెన నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ జేఈ వి.లక్ష్మీప్రసన్నను వివరణ కోరగా, వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లతో ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని, డిజైన్స్ అండ్ ప్లానింగ్ అనుమతులు వచ్చిన తరువాత టెండర్లు పిలుస్తామని తెలిపారు.



వాహనాల రాకపోకలకు తాత్కాలికంగా నిర్మించిన కల్వర్టు, సీసీ రోడ్డు



చెత్తచెదారంతో మూసుకుపోతున్న కల్వర్టు

వంతెనను తక్షణం పునర్నిర్మించాలి



ఇంజరం వంతెన వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక తూరల కల్వర్టు వద్ద చెత్త చెదారాలు చిక్కుకుపోవడంతో పూర్తిస్థాయిలో సాగునీరు పారడం లేదు. శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదు. వేసవి కాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. దాళ్వా సాగులో వరి పంట చేతికొచ్చే సమయంలో ఈ సమస్య కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 800 నుంచి వెయ్యి ఎకరాల వరకు వరి సాగుకు పూర్తి స్థాయిలో నీరందక వరిచేలు ఎండిపోయి రైతులు నష్టాల పాలవుతున్నారు. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఈ వేసవిలోనే ఇంజరం వంతెన పునర్నిర్మించాలి.

– వల్లు రాజబాబు, జిల్లా కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం

కౌలు రైతులకు న్యాయం చేస్తాం

జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు



జెడ్పీ చైర్మన్ విప్పర్తిని సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

కాట్రేనికోన: సత్తరువు కౌలు రైతుల సమస్యలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి న్యాయం చేస్తామని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు హామీ ఇచ్చారు. కాట్రేనికోన సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ స్వగృహంలో ఆయన అధ్యక్షతన గురువారం జెడ్పీ చైర్మన్‌కు సన్మాన కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ నేల కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు, మోకా చంద్రనాగరత్నం, వాసంశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి శ్రీను తదితరులు పూలమాలలతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు జెడ్పీ చైర్మన్‌కు తమ గోడు వెళ్లగక్కారు. కాట్రేనికోన పంచాయతీ పరిధిలో ఉన్న పేరూరు జిల్లా పరిషత్ పాఠశాల సత్తరువుకు చెందిన భూములు 54 ఎకరాలను 69 మంది కౌలుకు చేసుకుంటున్నామని, కొంత కాలంగా భూములు చౌడుబారి నష్టపోయామని, శిస్తు చెల్లించలేకపోయామన్నారు. కౌలు సొమ్ము చెల్లించాలంటూ జెడ్పీ అధికారులు నుంచి నోటీసులు వచ్చాయన్నారు. దీనిపై అధికారులతో మాట్లాడతామని విప్పర్తి చెప్పారు. ఈ కార్యక్రమంలో అమలాపురం, ముమ్మిడివరం జెడ్పీటీసీలు పందిరి శ్రీహరి, కుడిపూడి శంకరరావు, నల్లా రాంబాబు, కముజు మల్లి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు బీమా చేయించాలి

పశు సంవర్ధక శాఖ ఏడీ విజయరెడ్డి



వన్నె చింతలపూడిలో పశువులను పరిశీలిస్తున్న ఏడీ విజయరెడ్డి

అమలాపురం రూరల్: పాడి పశువులు ఆకస్మికంగా చనిపోతే రైతుకు ఆర్థిక నష్టం జరగకుండా ప్రభుత్వం పశు బీమా కార్యక్రమం చేపట్టిందని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయరెడ్డి అన్నారు. వన్నె చింతలపూడి పశు వైద్యాధికారి డాక్టర్ పూర్ణిమ నాగలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం రైతులకు పశు బీమాపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏడీ విజయ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు ఇదెంతో లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. పశువులకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు బీమా చేస్తారని తెలిపారు. రూ.15 వేల బీమాకు రూ.200, రూ.30 వేల బీమాకు రూ.400 రైతులు చెల్లిస్తే, మూడేళ్ల పాటు బీమా కొనసాగుతుందని వివరించారు. ప్రైవేటు సంస్థల ద్వారా బీమా చేయిస్తే ఎక్కువ ఖర్చవుతుందని చెప్పారు. ఒకవేళ పశువును బీమా చేశాక, దానిని అమ్మినా కొనుగోలు చేసిన వారి పేరున బీమా మార్చుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, పశు సంవర్ధక శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగావకాశాలు



సర్టిఫికెట్లు అందుకున్న అభ్యర్థులతో జనార్దనరావు తదితరులు

తాళ్లరేవు: స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థుల జీవన ప్రమాణాలు పెరిగి, మంచి ఉద్యోగాలు లభిస్తాయని కోరింగా ఫార్మసీ కళాశాల చైర్మన్ దున్నా జనార్దనరావు అన్నారు. గురువారం కళాశాల సెమినార్ హాలులో జాతీయ ఫార్మసీ ఎడ్యుకేషన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోనే తొలిసారిగా కోరింగా ఫార్మసీ కళాశాలకు ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 ద్వారా ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ శిక్షణా కేంద్రాన్ని కేటాయించారన్నారు. దీనిద్వారా శిక్షణ పొంది, నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి మాట్లాడుతూ, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కొత్త ఆలోచనలు, నూతన ఆవిష్కరణలతో ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరాజు, ట్రైనర్ హేమ, ఏఓ కె.మాల తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల ఆభరణాల స్వాధీన ప్రక్రియ ప్రారంభం



పిల్లారాయ ఆలయంలో ఆభరణాల స్వాధీన ప్రక్రియ నిర్వహిస్తున్న అధికారులు

యానాం: పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ కమిషనర్ ఆదేశాల మేరకు యానాంలోని వేంకటేశ్వర దేవస్థానం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఆధ్వర్యంలో ఉన్న శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, రాజరాజేశ్వరీ సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయం, పిల్లారాయ ఆలయం, పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాలకు సంబంధించిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగలు తదితర విలువైన సామగ్రిని సంబంధిత దేవస్థానం పాత కమిటీ నుంచి స్వాధీనపరుచుకునే ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. స్థానిక పిల్లారాయ ఆలయంలో ఆభరణాలకు సంబంధించి అప్పగించే ప్రక్రియకు టెంపుల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జ్యోతి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ టీఏటీ వినకోటి ఉషారాణి, పాలిటెక్నిక్ కళాశాల సూపరింటెండెంట్ సాధనాల బాబు, విద్యుత్ సూపరింటెండెంట్ సూర్యనారాయణమూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ అద్దంకి మల్లికార్జునరావు అధికారికంగా సాక్షులుగా ఉన్నారు. తొలి రోజు పాత దేవస్థానం కమిటీ చైర్మన్ కాపగంటి ఉమాశంకర్, సభ్యుడు కాదా వెంకటేశ్వరరావు తెచ్చిన రికార్డులు, సంబంధిత ఫైళ్లు, పాస్‌బుక్స్, అకౌంట్లను, బ్రహ్మోత్సవాల ఫైళ్లు తదితర సుమారు వందకు పైగా రికార్డులను పరిశీలించారు. సంబంధిత వివరాలు ఎప్పటికప్పుడు పుదుచ్చేరి హెచ్ఆర్ కమిషనర్‌కు తెలియజేశారు. ఇంకా ఆభరణాలు లెక్కించాల్సి ఉండటంతో, శుక్రవారం సైతం ఈ ప్రక్రియ కొనసాగనుంది.

ధర్మారావుకు జెడ్పీ చైర్మన్ పరామర్శ



కాట్రేనికోనలో ఎంపీపీ లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విప్పర్తి, ఇతర నాయకులు

కాట్రేనికోన: ఎంపీపీ పాలెపు లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆమె భర్త, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాలెపు ధర్మారావును జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, జెడ్పీటీసీలు పందిరి శ్రీహరి, కుడిపూడి శంకర్, నేల కిషోర్‌కుమార్ గురువారం పరామర్శించారు. ఎంపీపీ లక్ష్మి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు, గంటి వెంకటసుధాకర్, సానబోయిన నాగేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు శ్రద్ధాంజలి ఘటించిన వారిలో ఉన్నారు.

సాగునీటి సమస్యపై అప్రమత్తం

- శివారు ప్రాంతాలను సందర్శించిన అధికారులు
- అక్రమ ఇంజిన్ల తొలగింపు



పంట కాలువపై ఉన్న అక్రమ ఇంజిన్‌ను తొలగిస్తున్న అధికారులు

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ శివారు భూములకు సాగునీరు అందడం లేదంటూ కొద్ది రోజులుగా రైతన్నలు ఆందోళన చేయడంపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు డివిజన్, మండల స్థాయి అధికారులు గురువారం నీటిఎద్దడి ఉన్న శివారు ప్రాంతాలను సందర్శించి, సాగునీటి సరఫరాకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, ఏఈ ఉద్దిశ అనూష, ఫిషరీస్ డీడీ కరుణాకర్‌రావు, కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ, కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ, తహసీల్దార్ పితాని త్రినాథరావు, డీటీ సూరిబాబు, ఆర్ఐ రామకృష్ణ, ఏఓ ప్రశాంతి వివిధ శాఖల అధికారులు పర్యటించి, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏటా దాళ్వాలో నీటి ఎద్దడి కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని శివారు ప్రాంత రైతులు వాపోయారు. కొన్ని రోజులుగా సాగునీరు అందక వరిచేలు బీటలు వారుతున్నాయని, దుబ్బులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు రైతులు పంట కాలువలో నీటిని ఇంజిన్లతో తోడడంతో సాగునీరు శివారుకు రావడం లేదని ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి మూలపొలం, గ్రాంటు గ్రామాల పరిధిలో ఉన్న ఓఎన్జీసీ పైపులైన్ల వాల్వులను ఓపెన్ చేసి నీటిని పొలాలకు విడుదల చేశారు. పి.మల్లవరం ప్రధాన పంట కాలువ సౌత్ కెనాల్‌లో అక్రమంగా ఇంజిన్లు ఏర్పాటు చేసి, సాగునీటిని తోడుతున్న 12 ఇంజిన్లను అధికారులు తొలగించారు. వంతు ఉన్నప్పుడు మాత్రమే రైతులు నీటిని పెట్టుకోవాలని, అనుమతుల్లేకుండా అక్రమంగా మోటార్లు, ఇంజిన్లతో నీరు తోడినా, కాలువలకు గండ్లు కొట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈఈ రామకృష్ణ హెచ్చరించారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై 79933 32244 నంబరుకు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలన్నారు. వీరి వెంట డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, పలువురు నాయకులు ఉన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు గడువు పెంపు

అల్లవరం: గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో 2025–26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫస్టియర్ (ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశానికి ఈ నెల 13 వరకు గడువు పెంచినట్టు ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీసీ రోడ్డు, డ్రైన్‌కు నిధుల మంజూరు

అల్లవరం: ప్రధాన రహదారి నుంచి 30 పడకల ఆస్పత్రి వరకు సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరైనట్టు పీఆర్ డీఈ రాజ్‌కుమార్ తెలిపారు. అల్లవరంలోని సీహెచ్‌సీని ఆస్పత్రి సూపరింటెండెంట్ సరోజినితో కలసి గురువారం ఆయన పరిశీలించారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని డీఈ చెప్పారు. వీరి వెంట రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ డి.సత్తిబాబురాజు ఉన్నారు.

యథేచ్ఛగా ఆక్రమణల పర్వం

- ప్రభుత్వ భూముల్లో పాగా
- కొమ్ముకాస్తున్న కూటమి నేతలు!



విలసవిల్లిలో జగనన్న కాలనీని ఆనుకుని ఆక్రమిస్తున్న స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



విలసవిల్లిలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి పంచాయతీలో ఉన్న ప్రభుత్వ భూములను కొందరు యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. గ్రామంలో గత ప్రభుత్వం హయాంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా సర్వే నం.172–3లో 76 సెంట్లలో కొంత భూమిని పది మంది లబ్ధిదారులకు అందించారు. మిగిలిన స్థలంలో గ్రామస్తుల అవసరాల రీత్యా మంచినీటి ట్యాంకు, అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించేందుకు పంచాయతీ సమావేశాల్లో తీర్మానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక్కడున్న ఖాళీ స్థలంపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. కూటమి నాయకుల సహకారంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇక్కడ తాటాకిల్లు వేసేందుకు సామగ్రిని చేరవేయడం గ్రామస్తుల్లో చర్చనీయాంశమైంది. దీనిపై గ్రామ రెవెన్యూ అధికారి ఆ ప్రాంతాన్ని పరిశీలించి, నోటీసు జారీ చేసినప్పటికీ పంచాయతీ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదేవిధంగా గ్రామంలోని సర్వే నం.56–5లో 18 సెంట్ల ప్రభుత్వ భూమిలో ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకుని బిల్డింగ్ నిర్మించాడు. రెండేళ్ల క్రితం అప్పటి తహసీల్దార్ ఈ స్థలం ఆక్రమణను అడ్డుకుని నోటీసు ఇచ్చారు. ఏమైనా నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించి, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టిలోను పెట్టారు. అయినా కొందరు కూటమి నాయకుల వత్తిళ్లతో అధికారులు పట్టించుకోకపోవడంతో,అక్రమ నిర్మాణం చేసినట్టు చెప్పుకొంటున్నారు. అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఇటువంటి పరిస్థితులు తలెత్తేవి కావని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

మాజీ కౌన్సిలర్ శ్రీహరి కన్నుమూత



మట్టపర్తి శ్రీహరి (ఫైల్)

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, శెట్టిబలిజ నాయకుడు మట్టపర్తి శ్రీహరి(75) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో బుధవారం సాయంత్రం కన్నుమూశారు. 1990లో మున్సిపల్ కౌన్సిలర్‌గా శ్రీహరి కౌన్సిలర్‌గా పనిచేశారు. ఈయన ప్రస్తుత మున్సిపల్ కౌన్సిల్‌లో కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర సోదరుడు. శ్రీహరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. హైదరాబాద్ నుంచి అమలాపురంలోని దొమ్మేటివారి వీధిలో స్వగృహానికి ఆయన మృతదేహాన్ని గురువారం తీసుకొచ్చారు. కెనడాలో ఉన్న ఆయన కుమార్తె వచ్చాక మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఆయన మృతికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, చిట్టూరి పెదబాబు తదితరులు సంతాపం తెలిపారు.

అమ్మవారికి వెండి తోరణం



యానాం: పట్టణంలోని వెంకటనగర్‌లో ఉన్న దుర్గా భవాని అమ్మవారికి గురువారం దాతలు వెండితోరణం బహూకరించారు. ఈ సందర్భంగా దివంగత సమ్మె వెంకటరమణ, సూర్యకాంతం దంపతుల పెద్ద కుమారుడు వీరవెంకట సత్యనారాయణ దంపతులు, కుటుంబ సభ్యులు రూ.1.60 లక్షల విలువైన 1.800 కేజీల వెండి చీర, వెండి తోరణాన్ని అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అందజేశారు.

బాధితుడికి ఆర్థికసాయం

ఐ.పోలవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాల మహానాడు నాయకుడు కాశి మోహన్‌బాబుకు సంఘ మండల నాయకులు రూ.90 వేల సాయం అందించారు. ఈ సాయాన్ని గురువారం అందజేసినట్టు సంఘ మండల అధ్యక్షుడు రేవు శ్రీను తెలిపారు.

అధ్యాపక పోస్టుకు 14న ఇంటర్వ్యూలు

యానాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న షార్ట్‌టర్మ్ కాంట్రాక్టు సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకుని పోస్టు భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు గురువారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.నాగఅజ్మీరా ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఈ, బీటెక్(ప్రథమ శ్రేణి) ఉత్తీర్ణతతో పాటు, అదనంగా ఎంటెక్, పీహెచ్‌డీ, బోధనా అనుభవం ఉన్నవారికి అదనపు మార్కులు ఉంటాయన్నారు. ఈ నెల 14న ఉదయం పది గంటలకు కళాశాలలో జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

ఎల్జీకి ఎమ్మెల్యే ఫిర్యాదు

యానాం: పట్టణంలో వారం రోజులుగా పారిశుద్ధ్య పనుల నిలిపివేత, ప్రత్యామ్నాయ స్థలం చూపించడంలో అధికారుల వైఫల్యం తదితర సమస్యలతో ప్రజల్లో తనపై వ్యతిరేకత తేవడానికి రాజకీయంగా కొందరు కుట్ర చేస్తున్నారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలంటూ గురువారం ఎల్జీ కె.కైలాషనాథన్‌కు ఫిర్యాదు చేసినట్లు గురువారం ఇక్కడ ప్రకటన విడుదల చేశారు. ఊరంతా దుర్గంధం వ్యాపిస్తున్నా, డంపింగ్ యార్డుకు స్థలాన్ని చూపించకుండా అధికారులు ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని ఎల్జీకి విజ్ఞప్తి చేశానన్నారు. రెండు రోజుల్లో పుదుచ్చేరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పుడా) అధికారులు యానాం వస్తున్నట్టు చెప్పారు.

వీఆర్ఏ మృతి

ఉప్పలగుప్తం: ఎస్.కొత్తపల్లి గ్రామంలో రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్న మధుర పరంజ్యోతి గురువారం గుండెపోటుతో మరణించారు. ఆయన భౌతికకాయానికి తహసీల్దార్ వీఎస్ దివాకర్ నివాళులర్పించారు.